ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తమిళనాడు
TAMILNADU
గురువారం 25 జూలై 2024

వచ్చే నెలలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ



పెరంబూర్, జూలై 24: కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో అర్హులైన వారికి వచ్చే నెలలో కొత్త కార్డులు అందించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. రేషన్ కార్డు ద్వారా రాయితీ ధరకు రేషన్ దుకాణాల్లో ఉచిత బియ్యం, తక్కువ ధరకు చక్కెర, పామాయిల్, గోధుమలు తదితరాలు అందిస్తున్నారు. డీఎంకే అధికారం చేపట్టిన వెంటనే కొత్త 'స్మార్ట్ కార్డు' విధానాన్ని అమలు చేసింది. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో స్మార్ట్ కార్డులు ఇస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అదే సమయంలో, కలైంజర్ మహిళా సాధికారిక నిధులు పొందేందుకు స్మార్ట్ కార్డు ఆధారంగా లబ్దిదారులను ఎంపిక చేస్తున్నారు. దీంతో, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య అధికమైంది. 2021 లెక్కల ప్రకారం రాష్ట్రంలో 2.10 కోట్ల రేషన్ కార్డులున్నాయి. అనంతరం 2022లో కార్డుల సంఖ్య 10 లక్షలు పెరిగి 2.20 కోట్లకు చేరింది. ఆ ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 2 కోట్ల 24 లక్షల 19 వేల 359 కార్డులున్నాయి. తాజాగా 2.40 లక్షల మంది కొత్త రేషన్ కార్డులు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అంతలో పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికలు ముగిసిన అనంతరం దరఖాస్తులు పరిశీలిస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన పనులు చేపట్టినట్లు, అర్హులైన వారికి వచ్చే నెల నుంచి స్మార్ట్ కార్డులు అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

తగ్గిన బంగారం ధర

- దుకాణాలకు పోటెత్తిన జనం
- 15 శాతం పెరిగిన విక్రయాలు

నగల దుకాణంలో కొనుగోళ్లలో వినియోగదారులు



చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు తగ్గడంతో నగల కొనుగోలుకు ప్రజలు ఎగబడుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా బంగారం దుకాణాలు క్రిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఒక్కరోజులోనే 15 శాతం వరకు విక్రయాలు పెరిగినట్లు నిర్వాహకులు చెబుతుండడం విశేషం. కేంద్ర విత్తమంత్రి దాఖలు చేసిన బడ్జెట్లో బంగారం దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కారణంగా బంగారం ధర గణనీయంగా తగ్గింది. గత ఏడాది జూలై నెలలో సవరం బంగారం రూ.44 వేలు పలికింది. ఈ ధర మరింత పెరిగి ఈ నెల 19వ తేది రూ.55 వేలకు చేరింది. ఒకే ఏడాదిలో సవరం బంగారం రూ.11 వేలకు పెరగడంతో, సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారు కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. అయినా వివాహం, విశేష రోజుల్లో బంగారం కొనుగోలు చేయాల్సి రావడంతో వారిపై అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం పార్లమెంటులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దాఖలు చేసిన బడ్జెట్‌లో, బంగారు దిగుమతి సుంకం తగ్గించడంతో ఒకేసారి బంగారం నేలకు దిగొచ్చింది. ఈ నేపథ్యంలో, బుధవారం కూడా బంగారం రూ.480 తగ్గి, సవరు రూ.51,920కి విక్రయమైంది. దీంతో, నగరంలోని బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. అదే సమయంలో, వెండి దిగుమతుల సుంకం కూడా 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గడంతో, రెండు రోజుల్లో కిలోకు రూ.4 వేలు తగ్గింది. అలాగే, ప్లాటినం దిగుమతులపై సుంకం 15.4 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గడంతో వాటి ధరలు కూడా తగ్గాయి. దీంతో, బంగారు ఆభరణాలతో పాటు వెండి వస్తువులు, ప్లాటినమ్ ఆభరణాలు కొనేందుకు కూడా వినియోగదారులు ఆసక్తి చూపారు.



బంగారు ఆభరణాల కొనుగోలులో మహిళ

సీఎం ఢిల్లీ పర్యటన రద్దు

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'తమిళనాడు హౌస్'కు శంకుస్థాపన





పోలీసు వాహనాలను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఢిల్లీలో కొత్తగా నిర్మించదలచిన తమిళనాడు హౌస్‌కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేయాలని నిర్ణయించుకున్నారు. 2024-25కు సంబంధించిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడం పట్ల డీఎంకే తీవ్ర ఆగ్రహంతో వుంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమిని ప్రజలు పట్టించుకోకపోవడం వల్లనే కక్ష పూరితంగా కేంద్రప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందంటూ ఇప్పటికే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అంతేగాక కేంద్రప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 27న ఢిల్లీలో జరుగనున్న నీతి ఆయోగ్ సమావేశాన్ని కూడా బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో స్టాలిన్ ఢిల్లీ పర్యటన రద్దయింది. వాస్తవానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశంతో పాటు తమిళనాడు హౌస్ భవనానికి శంకుస్థాపన కూడా చేయాలని సీఎం భావించారు. అయితే స్టాలిన్ ఢిల్లీ పర్యటన రద్దవడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అభివృద్ధి పథకాలకు శ్రీకారం...

ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టారు. హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని తొమ్మిది దేవాలయాల్లో రూ.35.57 కోట్లతో నిర్మించదలచిన 14 భవనాలకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా మరో 9 దేవాలయాల్లో రూ.20.53 కోట్లతో ఏర్పాటు చేసిన 13 పథకాలను ప్రారంభించారు. అంతేగాక కరూర్ రత్నగిరి దేవాలయంలో రూ.9.10 కోట్లతో నిర్మించిన కమ్మివడ వాహనాన్ని కూడా సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంపీ స్వామినాథన్, పీకే శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి చంద్రమోహన్, కమిషనర్ పీఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చెన్నై పోలీసుల కోసం రూ.74.8 లక్షలతో కొనుగోలు చేసిన ఆధునిక సాంకేతికత జోడించిన 85 వాహనాలను సీఎం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు.



మంత్రి సుబ్రమణ్యంతో పార్కులో సెల్ఫీ తీసుకుంటున్న యునైటెడ్ అరబ్ మంత్రి తదితరులు

యూఏఈ మంత్రితో ఆరోగ్యశాఖమంత్రి జాగింగ్

పెరంబూర్, జూలై 24: నగర పర్యటనకు వచ్చిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థికశాఖ మంత్రి అబ్దుల్లా బిండిక్ అల్ మరీతో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం బుధవారం ఉదయం జాగింగ్ చేశారు. యూఏఈ ఆర్థిక శాఖ మంత్రి నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు, పెట్టుబడిదారులు భారతదేశ పర్యటనకు వచ్చారు. ఆ బృందం బుధవారం నగరంలో జరిగిన 'ఇన్వెస్టోఫియా గ్లోబల్ టాక్స్' మహానాడులో పాల్గొనేందుకు మంగళవారమే వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజామున ఆ బృందం రాష్ట్ర మంత్రి ఎం.సుబ్రమణ్యంతో కలిసి బీసెంట్ నగర్‌లో జాగింగ్ చేశారు. అనంతరం రోడ్డు పక్కన దుకాణంలో వారంతా కలిసి టీ తాగారు. ఈ సందర్భంగా యూఏఈ మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రితో కలసి జాగింగ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని, ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా భారత్‌తో తమ దేశం సత్సంబంధాలు కలిగి ఉందని ఆయన తెలిపారు.



యునైటెడ్ అరబ్ మంత్రితో మంత్రి సుబ్రమణ్యం జాగింగ్

ఎన్నికల ఓటమిపై ఈపీఎస్ సమీక్ష

ప్యారీస్, జూలై 24: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆయా నియోజకవర్గాల నేతలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ నెల 10న రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ప్రారంభమైన తొలివిడత సమావేశం 19వ తేది వరకు సాగింది. ఏడు రోజుల్లో 23 నియోజకవర్గాల నేతలు సమావేశంలో పాల్గొని, పార్టీ ఓటమికి గల కారణాలపై అభిప్రాయాలు తెలియజేశారు. ఎన్నికల్లో బలమైన కూటమి లేదని, రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సీట్లలో గెలిచి ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు ఇప్పటి నుంచే వ్యూహరచన చేయాలని పలువురు నేతలు అభిప్రాయాలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, రెండో విడత సమీక్షా సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు పార్టీ ప్రిసీడియం చైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్ అధ్యక్షతన ప్రారంభమైంది. ముందుగా తేని, మధ్యాహ్నం 4 గంటలకు ఆరణి నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులు, పార్టీ నిర్వాహకులు హాజరయ్యారు. ఈ సమీక్షా సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, సీనియర్ నేతలు కేపీ మునుస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, ఆర్బీ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు. గురువారం తెన్‌కాశి, ఈరోడ్ నియోజకవర్గాల నిర్వాహకులు ఈపీఎస్‌తో భేటీ కానున్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎడప్పాడి, ప్రిసీడియం చైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్ తదితరులు



తేని నియోజకవర్గ నాయకులు

'ఉదయ్' పథకంతో పలు ప్రయోజనాలు

- మంత్రి తంగమణి

అడయార్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఉదయ్' విద్యుత్ పథకంలో చేరడం వల్ల రాష్ట్రానికి అనేక ప్రయోజనాలు సమకూరుతున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి తంగమణి తెలిపారు. ఈ విషయమై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయ్ విద్యుత్ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం చేరేందుకు అంగీకారం తెలుపుతూ సంతకం చేసినట్టు తెలిపారు. ఈ విద్యుత్ పథకం వల్ల రాష్ట్ర విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ డిస్కంల రుణ భారం తగ్గుతుందన్నారు. అధిక వడ్డీ స్థానంలో అతి తక్కువ వడ్డీకి రుణాలు తీసుకునే వెసులుబాటు లభిస్తుంది. నేల బొగ్గు కేటాయింపులు జరుగుతాయన్నారు. కేంద్ర సంస్థలు, కేంద్ర ఏజెన్సీల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవచ్చన్నారు. తద్వారా యేడాదికి రూ.11 వేల కోట్ల మేరకు నిధులను ఆదా చేయొచ్చన్నారు. ఇలాంటి పలు అంశాల్లో ఉదయ్ విద్యుత్ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో డిస్కంలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ఈ పథకం దోహదపడుతుందని మంత్రి తంగమణి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

కుటుంబాన్ని బలిగొన్న అప్పులు

- తిరుచ్చి జిల్లాలో ముగ్గురి ఆత్మహత్య







మృతులు కృతిక, సాయినందిని, గోకుల్‌నాథ్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, జూలై 24: తిరుచ్చి జిల్లా మనచ్చనల్లూర్ సమీపంలోని కామరాజర్ కాలనీలో అప్పుల బాధతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కృష్ణమూర్తి-కృతిక దంపతులకు సాయినందిని (11) అనే కుమార్తె, గోకుల్‌నాథ్ (14) అనే కుమారుడున్నాడు. రైస్ మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్న కృష్ణమూర్తి మంగళవారం రాత్రి పనికి వెళ్లి బుధవారం వేకువజామున 3 గంటలకు ఇంటికొచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో భార్య, ఇద్దరు పిల్లలు ఉరేసుకొని మృతిచెందడం గమనించి బోరున విలపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కృతిక మహిళా స్వయం సహాయక బృందంలో రుణం తీసుకొని తిరిగి చెల్లించకపోవడం, మిగిలిన సభ్యుల నుంచి ఒత్తిడి రావడంతో ఆమె, పిల్లలతో కలసి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం

- కార్యకర్తలకు ఉదయనిధి పిలుపు



షోళింగనల్లూరు నియోజకవర్గంలో 2007 మందికి పట్టాల పంపిణీ - ఇళ్ల పట్టాలతో లబ్దిదారులు



చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని డీఎంకే యువజన విభాగ అధ్యక్షుడు, రాష్ట్ర యువజన, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సత్ఫలితాలు వచ్చేలా డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యూహరచన చేశారు. ఇందుకోసం సీనియర్ మంత్రి కేఎన్ నెహ్రూ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ బృందంలో డీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ భారతి, మంత్రులు ఏవీ వేలు, తంగం తెన్నరసు, యువజన విభాగ అధ్యక్షుడు ఉదయనిధి తదితరులున్నారు. వీరంతా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రస్తుతం అమలుచేస్తున్న పథకాలు, మున్ముందు చేపట్టాల్సిన కార్యక్రమాలపై నివేదిక తయారు చేసి సీఎంకు అందించనున్నారు. ఇందులో భాగంగా డీఎంకేలో కీలకమైన నేతలతో ఉదయనిధి మంగళవారం రాత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయని, 90 శాతం మంది కార్యకర్తలు గట్టిగా కృషి చేశారని ప్రశంసించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇలాగే ప్రయత్నించాలని కోరారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ఇంటింటికీ ప్రచారం చేయాలని సూచించారు. అప్పుడే ప్రభుత్వం గురించి ప్రజలకు బాగా తెలుస్తుందన్నారు. పార్టీ మనకేం చేసిందనే దానికన్నా, పార్టీకి మనమేం చేశామన్నదానిపైనా కార్యకర్తలు ఆలోచించాలని ఉదయనిధి సూచించారు.

2007 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ ...

స్థానిక షోళింగనల్లూరు నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ అయిన ఇళ్ల పట్టాల పంపిణీ ఎట్టకేలకు నెరవేరింది. రాష్ట్ర యువజన సంక్షేమశాఖ మంత్రి ఉదయనిధి 2007 మందికి బుధవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షోళింగనల్లూరుకు చెందిన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం సంతోషంగా వుందన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ద్రావిడ మోడల్ తరహా పాలనలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. తమది పేదల పక్షపాతి ప్రభుత్వమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చెన్నైలో ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించడం సంతోషంగా వుందన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చి రెండు నెలలే అయ్యాయని, ఈ లోగా పలు హామీలను సీఎం నెరవేర్చారని ఉదయనిధి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మంత్రులు ఎం.సుబ్రమణ్యం, కేకేఎస్ఎస్ రామచంద్రన్, ఎమ్మెల్యే ఎళిలన్, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సమాచార ధ్వని

'టూరిజం డే' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 24: పర్యాటకాభివృద్ధికి కృషిచేసే వివిధ సంస్థలకు రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అందజేసే 'వరల్డ్ టూరిజం డే' పురస్కారానికి ఆగస్టు 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ సమయమూర్తి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పర్యాటకుల ఆనందం వంటి అంశాల్లో పర్యాటక రంగాలకు సంబంధించిన వారిని ప్రోత్సహించేలా ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 27వ తేది పురస్కారాలు అందజేయనున్నామని తెలిపారు. స్వచ్ఛ పర్యాటక స్థలం, బస, ఇతర సౌకర్యాలు వంటి ఆధారంగా 17 పురస్కారాలు అందజేస్తున్నామని, అర్హులైన సంస్థలు, వ్యక్తులు www.tntourismawards.com అనే వెబ్‌సైట్‌లో ఆగస్టు 20వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

4న 'తెలుగు తరుణి' వార్షికోత్సవం

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): 'తెలుగు తరుణి' 9వ వార్షికోత్సవం ఆగస్టు 4వ తేదీ జరుగనుంది. మైలాపూర్, లజ్‌చర్చిరోడ్డులో వున్న ఆంధ్ర మహిళా సభలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సీనియర్ పాత్రికేయురాలు కమలాకర రాజేశ్వరి, గౌరవ అతిథిగా రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుమబాల, ప్రత్యేక అతిథిగా సూపర్‌సింగర్ విజేత శ్రేయాన్వి హాజరుకానున్నారు. కార్యక్రమంలో భాగంగా అతిథులను సత్కరించనుండగా, ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను, పోటీలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షురాలు కె.రమణి, కార్యదర్శి పి.దేవసేన, కోశాధికారి ఎం.అపర్ణ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

కేరళకు 'ఎడ్యుకేషన్ టూర్' వద్దు

పెరంబూర్, జూలై 24: కేరళ రాష్ట్రానికి ఎడ్యుకేషన్ టూర్‌కు వెళ్లొద్దని ఉన్నత విద్యాశాఖ హెచ్చరించింది. ఈ మేరకు కోవై మండల కళాశాల విద్య డైరెక్టర్ కలైసెల్వి అన్ని వర్సిటీలు, విద్యాసంస్థలకు పంపిన సర్క్యులర్‌లో... కేరళ రాష్ట్రంలో నిఫా వైరస్ వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో,విద్యార్థుల భద్రత దృష్ట్యా ఆ రాష్ట్రానికి విద్యార్థులను ఎడ్యుకేషన్ టూర్‌కు తీసుకెళ్లరాదని సూచించింది.

రూ.130 కోట్లతో 21 వేల ఇళ్లకు మరమ్మతులు

ఐసిఎఫ్, జూలై 24: నగరంలో 21,000 హౌసింగ్ బోర్డు గృహాల మరమ్మతులకు రూ.130 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. కన్నగినగర్, ఎళిల్ నగర్, సునామి నగర్ ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు 20 ఏళ్ల క్రితం 23,704 గృహాలు నిర్మించింది. అవి శిథిలావస్థకు చేరుకోవడంతో వాటికి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. కన్నగినగర్‌లో 10,460 గృహాలను రూ.41 కోట్లతో, సెమ్మంజేరిలో 3,000 గృహాలను రూ.30 కోట్లతో, పెరుంబాక్కంలో 8,000 గృహాలను రూ.60 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయిన వెంటనే పెయింటింగ్ కూడా వేయిస్తామని అధికారులు తెలిపారు.

చెన్నై మెట్రోకు అంతర్జాతీయ అవార్డు

ఐసిఎఫ్, జూలై 24: చెన్నై మెట్రోకు అంతర్జాతీయ అవార్డు లభించింది. నగరంలో రెండో విడత మెట్రో రైలు పనులు జరుగుతున్నాయి. సురక్షితంగా రైళ్లు నడిపేందుకు సౌకర్యం, సొరంగ మార్గాల్లో గాలి, వెలుతురు లభించేలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. తక్కువ స్థలం, తక్కువ ఖర్చుతో ఈ పథకాలను రూపొందించిన చెన్నై మెట్రోరైలు సంస్థ (సీఎంఆర్‌ఎల్) అంతర్జాతీయ పురస్కారానికి ఎంపికైంది. డెన్మార్క్‌లోని కోపెన్ హాకన్‌లో అక్టోబరు 28 నుంచి 30వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ మహానాడులో ఈ అవార్డు అందజేయనున్నట్లు సీఎంఆర్‌ఎల్ తెలిపింది.

27 నుంచి పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 24: ఆర్ట్స్ అండ్ సైన్స్ పీజీ కోర్సుల దరఖాస్తు స్వీకరణ ఈ నెల 27 నుంచి ప్రారంభం కానుంది. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో ఇప్పటివరకు 85,237 మంది చేరారు. 85 శాతం అడ్మిషన్లు జరిగిన నేపథ్యంలో, ఇంకా సమయం ఉండడంతో 100 శాతం అడ్మిషన్లు జరుగనున్నాయి. పీజీ కోర్సులకు ఈ నెల 27 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆగస్టు 10వ తేది ర్యాంకుల జాబితా విడుదల చేసి, 13వ తేది ప్రత్యేక విభాగాలు, 19 నుంచి 23వ తేది వరకు జనరల్ వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. 28వ తేది నుంచి పీజీ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నాయి. అలాగే, మద్రాసు విశ్వవిద్యాలయ డిగ్రీ పరీక్షా ఫలితాలు ఈ నెల 26వ తేది విడుదల చేయనున్నట్లు ఉన్నత విద్యాశాఖ తెలిపింది.

చదురగిరి ఆలయానికి ఐదు రోజుల అనుమతి

ప్యారీస్, జూలై 24: విరుదునగర్ జిల్లా చదురగిరి కొండలపై వెలసిన సుందర మహాలింగం ఆలయంలో ఆడి అమావాస్య ఉత్సవాలు ఆగస్టు 1 నుంచి 5వ తేది వరకు జరుగనున్న నేపథ్యంలో, దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. చదురగిరి ఆలయానికి మదురై జిల్లా సాప్టూర్ సమీపంలోని పశ్చిమ కనుమల మీదుగా, వత్తియాయిరుప్పు మీదుగా వెళ్లేందుకు రెండు కొండ మార్గాలున్నాయి. అయితే, 90 శాతం మంది భక్తులు ఇక్కడికి తానిపారై మీదుగా వెళుతుంటారు. సముద్రమట్టం నుంచి 4,500 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఆలయంలో ఇప్పుడు కూడా సాధువులు నివసిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సుందర మహాలింగ స్వామి దర్శనానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు ప్రతినెలా అమావాస్య, పౌర్ణమి రోజుల్లో తలా మూడు రోజులు, ప్రదోషానికి రెండు రోజులు మొత్తం 8 రోజులు కొండ మార్గంలో పాదయాత్రగా వెళుతుంటారు. ప్రధాన ఉత్సవమైన ఆడి అమావాస్య ఆగస్టు 4న జరుగనుంది. దీనిని పురస్కరించుకొని ఆగస్టు 1 నుంచి 5వ తేది వరకు అడవి ప్రాంతంలో ఉన్న కొండ మార్గం గుండా భక్తులను అనుమతిస్తారు.


తిరుచ్చి సూర్యపై మహిళ ఫిర్యాదు

ప్యారీస్, జూలై 24: డీఎంకే సీనియర్‌నేత, రాజ్యసభ సభ్యుడు తిరుచ్చి శివ కుమారుడు తిరుచ్చి సూర్యపై ఓ మహిళ గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనరేట్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు పంపించారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన వీడియోను సంబంధిత మహిళ బుధవారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ వీడియోలోని దృశ్యాలను తనకు అనుకూలంగా మలచుకుని తిరుచ్చి సూర్య తనను బెదిరిస్తున్నట్లు ఆ మహిళ ఫిర్యాదులో పేర్కొంది. తన గురించి ఎక్స్ పేజీలో నమోదు చేసిన అంశాలను తిరుచ్చి సూర్య తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆమె తన ఫిర్యాదులో కోరింది.

కల్వరాయన్ కొండలను సందర్శించండి

● హైకోర్టు సూచన

పెరంబూర్, జూలై 24: రాష్ట్ర ముఖ్యమంత్రి, లేదా క్రీడాభివృద్ధిశాఖ మంత్రుల్లో ఎవరో ఒకరు ఆదిద్రావిడ సంక్షేమ శాఖ మంత్రితో కలసి కల్వరాయన్ కొండ ప్రాంతాలను పరిశీలించాలని మద్రాసు హైకోర్టు సూచించింది. కళ్లకుర్చి కల్తీ సారా మృతుల ఘటన అనంతరం, కల్వరాయన్ కొండ ప్రాంత ప్రజల అభివృద్ధికి సంబంధించి మద్రాసు హైకోర్టు సుమోటోగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. ఈ కేసు బుధవారం న్యాయమూర్తులు ఎస్‌ఎం సుబ్రమణియం, సి.కుమరప్పన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ సమయంలో, ఈ కేసులో న్యాయస్థానానికి సహాయంగా నియమించిన సీనియర్ న్యాయవాది తమిళమణి తరఫున నివేదిక దాఖలుచేశారు. ప్రభుత్వం తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్, కల్వరాయన్ కొండ ప్రాంత ప్రజలకు కల్పించే సౌకర్యాలకు సంబంధించి కళ్లకుర్చి, సేలం జిల్లా కలెక్టర్లు నివేదిక సిద్ధం చేస్తున్నారని, శుక్రవారం నివేదిక దాఖలు చేస్తామని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని కేసు విచారణ ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం.. ఆ ప్రాంత ప్రజలకు కల్తీ మద్యం మాత్రమే ఆధారమైతే, దానిని నిర్మూలించాలంటే ఆ ప్రాంత ప్రజల జీవనోపాధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. కల్వరాయన్ కొండ ప్రాంతం కావడంతో ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవచ్చని సూచించింది. అలాగే, ఆ ప్రాంత ప్రజలకు సత్వరం అవసరమైన వైద్యం, విద్య, రవాణా తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్న ధర్మాసనం.. ఆ ప్రాంతానికి మేము వెళ్లేదానికన్నా, రాష్ట్ర ముఖ్యమంత్రి లేదా మంత్రి ఉదయనిధి, ఆదిద్రావిడ సంక్షేమ శాఖ మంత్రితో కలసి ఆ ప్రాంతాన్ని సందర్శిస్తే, ఆ ప్రాంత ప్రజలకు కొంత మేలు జరుగుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది.



కల్వరాయన్ కొండలు

'ప్రజలతో ముఖ్యమంత్రి' శిబిరం పరిశీలన



తరగతి గదులు పరిశీలిస్తున్న ప్రభుత్వ కార్యదర్శి లక్ష్మీప్రియ, కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 24: కనియంబాడి పంచాయతీ యూనియన్‌లో జరుగుతున్న 'ప్రజలతో ముఖ్యమంత్రి' ప్రత్యేక శిబిరాన్ని ఆదిద్రావిడ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సెక్రటరీ లక్ష్మీప్రియ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడిన ఆమె, ప్రజలు అందజేసిన వినతిపత్రాలను సత్వరం విచారించి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, సాంఘిక భద్రత ప్రత్యేక ఉప కలెక్టర్ కలియమూర్తి, రెవెన్యూ తహసీల్దార్ కవిత, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ ఉష తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెరుముగైలో ఉన్న ప్రభుత్వ ఆదిద్రావిడ సంక్షేమ ఉన్నత పాఠశాలను పరిశీలించి, విద్యార్థినీ, విద్యార్థులతో ఆమె సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్, జిల్లా విద్యాధికారి ధనలక్ష్మి తదితరులున్నారు.

బస్సు ఛార్జీలపై వదంతులు నమ్మొద్దు

● మంత్రి శివశంకర్

పెరంబూర్, జూలై 24: బస్సు ఛార్జీల పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు వస్తున్న వార్తలు వదంతులు మాత్రమేనని రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ స్పష్టం చేశారు. నగరంలో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రవాణా సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రయాణికులకు మెరుగైన వసతులు అందించేలా చర్యలు చేపట్టాలని, ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు ఎంతగానో ఆదరిస్తున్నారని, ఆ విషయం ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయన్నారు. డీఎంకే ప్రభుత్వంపై మహిళలు, అన్నివర్గాల ప్రజలు చూపిస్తున్న ఆదరణ ఓర్వలేని ప్రతిపక్షాలు, ఛార్జీలు పెంపు, రవాణా శాఖ ప్రైవేటుపరం అంటూ అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు.

కళాశాలలో కొత్త భవనాల ప్రారంభం



ప్రారంభోత్సవంలో మంత్రి పొన్ముడి, గాంధీ, దురైమురుగన్ తదితరులు

వేలూరు, జూలై 24: స్థానిక కాట్పాడి పంచాయతి యూనియన్ సేర్కాడు ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో రూ.12.46 కోట్లతో నిర్మించిన కొత్త భవనాలను రాష్ట్ర మంత్రులు పొన్ముడి, గాంధీ, దురైమురుగన్ ప్రారంభించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అమ్ములు విజయన్, జిల్లా పంచాయతి కమిటీ అధ్యక్షుడు బాబు, కార్పొరేషన్ మేయర్ సుజాత, ఉప మేయర్ సునీల్‌కుమార్, కాట్పాడి యూనియన్ అధ్యక్షుడు వేల్‌మురుగన్, ఉపాధ్యక్షుడు శరవణన్, 1వ మండల అధ్యక్షురాలు పుష్పలత, కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ మలర్, తిరువళ్లూర్ వర్సిటీ వైస్ చాన్సలర్ ఆర్ముగం, కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా గాంధీ సహా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ చీరతో అమ్మవారికి అలంకరణ



అమ్మవారికి ధరింపజేసిన రేషన్ దుకాణంలో అందించే ఉచిత చీర

పెరంబూర్, జూలై 24: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయానికి ప్రతిరోజు వేలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటుంటారు. రెండు రోజుల క్రితం పౌర్ణమి రోజున ఆలయంలోని ఉన్నామలై అమ్మవారి సన్నిధి ముందు ఉన్న అమ్మవారి విగ్రహానికి రేషన్ దుకాణాల్లో అందించే ఉచిత చీర అలంకరించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విషయమై అరుణాచలేశ్వర ఆలయ జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ... వేడుకల్లో కొందరు భక్తులు అమ్మవారిని అలరించేందుకు చీరలు అందజేశారని, వారిలో ఎవరో భక్తురాలు రేషన్‌లో అందించే ఉచిత చీర ఇచ్చారని తెలిపారు. ఈ చీరతో అమ్మవారిని అలకంరించడం గుర్తించిన వెంటనే ఆ చీర మార్చామని జాయింట్ కమిషనర్ తెలిపారు.

దేవాదాయ శాఖలో 11 మంది జేసీల బదిలీ

ఐసిఎఫ్, జూలై 24: నిర్వహణ పరంగా 11 మంది జాయింట్ కమిషనర్లకు బదిలీ చేస్తూ దేవాదాయ శాఖ కార్యదర్శి చంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేశారు. సమయపురం మారియమ్మన్ ఆలయ జాయింట్ కమిషనర్ కల్యాణి తిరుచ్చికి, తిరుచ్చి జాయింట్ కమిషనర్ ప్రకాష్ సమయపురానికి, తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ జాయింట్ కమిషనర్ కార్తీక్ దిండుగల్, అక్కడున్న జాయింట్ కమిషనర్ భారతి శివగంగకు, కాంచీపురం జాయింట్ కమిషనర్ వాన్మతి ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. మైలాడుదురై జాయింట్ కమిషనర్ మోహనసుందరం విల్లుపురానికి, విల్లుపురం జాయింట్ కమిషనర్ శివకుమార్ మైలాడుదురైకు, తిరుప్పూర్ జాయింట్ కమిషనర్ కుమరదురై కాంచీపురానికి, అక్కడున్న రత్నవేల్ పాండ్యన్ తిరుప్పూర్‌కు, శివగంగ జాయింట్ కమిషనర్ పళనికుమార్ కన్నియాకుమారికి, తంజావూరు జాయింట్ కమిషనర్ జ్ఞానశేఖరన్ తిరుచెందూర్‌కు బదిలీ అయ్యారు.

25 మంది ఎంపీలను గెలిపించి ఉంటే బడ్జెట్‌లో తమిళం పేరు

● పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి

పెరంబూర్, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడు పేరుండాలంటే 25 నియోజకవర్గాల్లో గెలిపించి ఉండాలని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి తెలిపారు. నగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 48 లక్షల కోట్లతో కూడిన బడ్జెట్‌లో తమిళనాడుకు ఏదైనా పథకం వచ్చిందా అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లు చెప్పాలంటే సాధ్యం కాదన్నారు. అది దేశ బడ్జెట్ అని, తమిళనాడు ఈ కేటాయింపులు, కేరళకు ఈ కేటాయింపులు, కర్ణాటకకు ఈ కేటాయింపులు అని ప్రతి రాష్ట్రం పేరు చెప్పలేరన్నారు. కొన్ని రోజుల్లో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి శాఖల వారీగా ఎంత కేటాయించారు అనే విషయం చెప్పేందుకు వీలవుతుందని అన్బుమణి తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీలపై నిషేధం

ఐసిఎఫ్, జూలై 24: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలకు నిషేధం విధిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పలు సంవత్సరాలుగా పనిచేసే ఉపాధ్యాయులకు వారి సొంతూర్లు, నచ్చిన ప్రదేశాలకు బదిలీ చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి ఏటా ఐచ్ఛిక బదిలీ కౌన్సెలింగ్ జరుగుతోంది. ఈ విద్యాసంవత్సరంలో గత రెండు వారాలుగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ జరుగుతోంది. హైకోర్టు ఉత్తర్వులు మేరకు మార్గదర్శకాలు పాటించి సీనియారిటీ ఆధారంగా ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు జారీచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, కౌన్సెలింగ్ జాబితాలో లేని ఉపాధ్యాయులకు రాజకీయ నేతల సిఫార్సులతో బదిలీ ఉత్తర్వులిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఉపాధ్యాయుల బదిలీలు తాత్కాలికంగా నిషేధిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ఈ కార్యాలయం ఎవరిది...?

కాంగ్రెస్-టీఎంసీ మధ్య ఘర్షణ ● తాళం వేసిన రెవెన్యూ అధికారులు



భవనం సమీపంలో కాంగ్రెస్ ఫ్లెక్సీ ఏర్పాటుచేస్తున్న కార్యకర్తలు (పక్క చిత్రంలో) అభ్యంతరం తెలుపుతున్న టీఎంసీ కార్యకర్తలు

పెరంబూర్, జూలై 24: పళనిలో ఉన్న కార్యాలయం ఎవరికి చెందినదనే విషయమై తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ), కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, ఆ కార్యాలయానికి రెవెన్యూ అధికారులు సీలు వేశారు. టీఎంసీ నగర అధ్యక్షుడిగా వ్యవహరించిన సుందర్ కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో, గతంలో ఆయన ఉంటున్న కార్యాలయంపై కాంగ్రెస్ జెండా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగైలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. దీనికి టీఎంసీ కార్యకర్తలు తీవ్ర వ్యతిరేకత తెలుపవడంతో, ఇరుపార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న పోలీసులు ఇరుపార్టీల కార్యకర్తలను అక్కడి నుంచి పంపించివేశారు.అనంతరం కార్యాలయ భవనానికి రెవెన్యూశాఖ అధికారులు సీలు వేశారు.

ఆంధ్ర నుంచి తెచ్చిన గంజాయి స్వాధీనం

ప్యారీస్, జూలై 24: స్థానిక వడపళనిలోని ఓ లాడ్జీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు 14 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారిని విచారించగా మదురై జిల్లాకు చెందిన కార్తీక్ (26), కలైసెల్వన్ (24) అని తెలిసింది. వీరిద్దరూ ఆంధ్ర నుంచి రైలులో నగరానికి గంజాయి తీసుకువచ్చి భవన నిర్మాణ పనులు జరిగే ప్రాంతాల్లో కార్మికులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

9 కిలోల గుట్కాతో 8 మంది అరెస్ట్...

పశ్చిమ బెంగాల్ నుంచి నగరానికి రైలులో అక్రమంగా తరలించిన 9 కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్న పోలీసులు, 8 మందిని అరెస్ట్ చేశారు. పెరంబూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని మంగళపురం ప్రాంతానికి ఈ నెల 20న 35 మందికి పైగా పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు వచ్చారు. ఓటేరి ఇన్‌స్పెక్టర్ రమేష్ నేతృత్వంలోని పోలీసులు మంగళవారం అనుమానాస్పదంగా కనిపించిన వారిని విచారించగా సంజయ్, మారి, దిలాప్ సర్దార్ సహా 8 మంది వద్ద 9 కిలోల గుట్కా స్వాధీనం చేసుకొని, వారిని అరెస్ట్ చేశారు.

న్యాయవాద వృత్తిపై కఠిన చట్టం చేయాలి

● హైకోర్టులో పిల్ దాఖలు

ప్యారీస్, జూలై 24: న్యాయవాద వృత్తి విధానంలో చట్టాన్ని మరింత కఠినతరం చేయాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఓ ప్రజావ్యాజ్యం దాఖలైంది. స్థానిక పెరంబూరు అగరంలో ఈ నెల 5వ తేదీన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో పలువురు న్యాయవాదులను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే, 2008 నుంచి ఇప్పటివరకు 15 యేళ్ళలో మొత్తం 15,927 మంది న్యాయవాదులు కొత్తగా బార్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకుని న్యాయవాదులుగా కొనసాగుతున్నారు. ఇందులో 2008లో ఎగ్మోర్ న్యాయస్థానం ప్రాంగణంలోనే ఓ న్యాయవాది దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ముగ్గురు న్యాయవాదులను అరెస్టు చేశారు. 2011లో సీనియర్ న్యాయవాది శంకర్ సుబ్బు కుమారుడు న్యాయవాది సతీష్ కుమార్ హత్యకు గురయ్యాడు.. 2013లో తంజావూరుకు చెందిన న్యాయవాది కన్నన్ కోర్టు ప్రాంగణంలోనే గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో మరణించాడు. 2014లో ఓ హోటల్‌లో న్యాయవాది నిత్యానందంను నలుగురు హతమార్చారు. 2015లో మళ్లీ ఎగ్మోర్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాద సంఘ ఎన్నికలు విజయోత్సవాలో న్యాయవాది స్టాలిన్ హత్యకు గురయ్యాడు. 2024 మార్చిలో సైదాపేట కోర్టు న్యాయవాది జైగణేశ్, అలాగే, తెన్‌కాశిలో న్యాయవాది అశోక్ కుమార్, తూత్తుక్కుడిలో న్యాయవాది ముత్తుకుమార్, ఈ నెల 5వ తేదీ న్యాయవాది, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు గురయ్యారు. ఈ కేసుల్లో పట్టుబడిన నిందితుల్లో 50 శాతానికి పైగా న్యాయవాదులే ఉన్నారని, పలువురు జైలుశిక్షలు కూడా అనుభవించారు. ఇలాంటి వారికి బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం కల్పించకుండా కఠిన చట్టాలను రూపొందించాలని కోరుతూ ఈ నెల 12, 18వ తేదీల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని నగరానికి చెందిన చార్లెస్ అలెగ్జాండర్ దాఖలు చేసిన పిల్‌లో పేర్కొన్నారు. ఇది త్వరలోనే విచారణకు రానుంది.

రూ.23 కోట్ల ప్రభుత్వ స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, జూలై 24: స్థానిక కుండ్రత్తూర్‌లో రూ.23 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుండ్రత్తూర్ సమీపంలోని పుదుపేడు-సోమంగళం రోడ్డు పక్కన పూమ్‌తండలం శక్తి నగర్‌లో 2.87 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. దీనిని ఆక్రమించిన కొందరు తాగునీటి శుద్ధీకరణ కేంద్రం, చిన్న కర్మాగారం వంటివి ఏర్పాటుచేశారు. ఈ సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు వెళ్లి ఆక్రమణలు తొలగించి స్థలం స్వాధీనం చేసుకున్నారు.

దోమల ఉత్పత్తికి కారణం.. జరిమానా

ఐసిఎఫ్, జూలై 24: దోమల ఉత్పత్తికి కారకమైన అపార్ట్‌మెంట్, భవన నిర్మాణ సంస్థలకు కార్పొరేషన్ అధికారులు రూ.6 లక్షలు జరిమానా విధించారు. అడయార్ మండలం 171వ వార్డు ఎమ్మార్సీ నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్ భవన నిర్మాణం జరుగుతోంది. అక్కడ నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాలు ఉండడాన్ని గుర్తించిన అధికారులు, రెండు నెలల క్రితమే నోటీసులు జారీచేశారు. అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న యజమాని నుంచి రూ.లక్ష జరిమానా వసూలుచేశారు. అలాగే, అదే ప్రాంతంలో ఓ భవన నిర్మాణ సంస్థలకు రూ.5 లక్షల జరిమానా విధించారు.

సైనికుడి దారుణహత్య

ప్యారీస్, జూలై 24: విరుదునగర్ జిల్లా రాజపాళయం సమీపంలో ఉన్న కుర్చియార్‌పట్టి గ్రామానికి చెందిన పొన్నుస్వామి (36) అనే సైనికుడిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చి పరారయ్యారు. పొన్నుస్వామికి ముత్తులక్ష్మి అనే భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మిలిటరీలో ఉద్యోగంలో చేరిన పొన్నుస్వామి ఏడేళ్ల క్రితం సస్పెండ్‌కు గురై సొంతూళ్లో తల్లిదండ్రులతో నివసిస్తున్నారు. మంగళవారం సాయంత్రం బైక్‌లో గోపాలపురంలో ఉన్న మిత్రుడిని చూసేందుకు ఇంటి నుంచి బయల్దేరిన పొన్నుస్వామిని ట్రాక్టర్‌లో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో నరికి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయన సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ టాస్క్ మోసం కేసులో నలుగురి అరెస్ట్

ప్యారీస్, జూలై 24: ఇతర వ్యక్తుల బ్యాంక్ ఖాతా నెంబర్ల ఆధారంగా ఆధునిక విధానంలో ఆన్‌లైన్ టాస్క్ మోసానికి పాల్పడ్డ కోవై, తిరుప్పూర్‌లకు చెందిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుప్పూర్‌కు చెందిన సెల్వం సైబర్ క్రైం పోలీసులకు గత నెల 1వ తేది తనను మోసం చేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. తనకు వాట్సాప్ ద్వారా పార్ట్ టైం జాబ్ అని, అందులో మ్యాప్ రివ్యూ చేసి ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇస్తే కమీషన్ గిట్టుతుందని నమ్మించి రూ.17.29 లక్షలు డిపాజిట్ చేయించుకొని మోసం చేశారని తెలిపారు. కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టగా ... సెల్వం నగదు పంపించిన బ్యాంక్ వివరాల ఆధారంగా ఆధునిక విధానంలో నలుగురు వ్యక్తులు ఆన్‌లైన్ టాస్క్ మోసానికి పాల్పడినట్లు తెలుసుకున్నారు. కోవైకి చెందిన నజీముద్దీన్, సయ్యద్ రెహ్మాన్, అనూప్ సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

పుట్టిన రోజే కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్యారీస్, జూలై 24: తూత్తుకుడి జిల్లా కుళత్తూర్‌కు చెందిన కాశిపాండ్యన్ (32) అనే కానిస్టేబుల్ పుట్టినరోజే ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. కుళత్తూర్‌కు చెందిన అరుణాచలం కుమారుడు కాశిపాండ్యన్‌కు వివాహం కాలేదు. 2018లో పోలీసు ఉద్యోగంలో చేరి ప్రస్తుతం తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణంలోని పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. వారం రోజుల క్రితం స్వగ్రామంలో జరుగుతున్న ఆణి ఉత్సవాలకు సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో, మంగళవారం తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. అయితే, ఇంట్లో ఎవరూ లేని సమయంలో కాశిపాండ్యన్ ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుప్పూర్‌లో జార్ఖండ్ వాసి ఆత్మహత్య

ప్యారీస్, జూలై 24: తిరుప్పూర్ ముమ్మూర్తి నగర్‌లో ఓ బనియన్ ఎగుమతి సంస్థకు చెందిన విడిది గృహంలో జార్ఖండ్ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ బనియన్ సంస్థకు చెందిన నాలుగంతస్తుల భవనంలో మహిళా కార్మికులకు వసతిగృహం ఉంది. జార్ఖండ్‌కు చెందిన నిషాకుమారి (21) మంగళవారం విధులకు వెళ్లకుండా విడిదిగృహంలోనే ఉండిపోయింది. మధ్యాహ్నం సహ ఉద్యోగులు వచ్చి చూడగా, నిషాకుమారి తన గదిలో ఫ్యానుకు ఉరేసుకొని కనిపించింది. ఈ విషయం తెలిసి సుమారు 500 మందికి పైగా ఉత్తరాది కార్మికులు విధులు బహిష్కరించి ధర్నాకు దిగారు. అక్కడకు చేరుకున్న పోలీసులు... కంపెనీ యాజమాన్యంతో చర్చించి మృతురాలి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది.

13 ఏళ్ల బాలికపై అత్యాచారం

● ముగ్గురు వృద్ధుల అరెస్ట్



పన్నీర్‌సెల్వం, రాజేంద్రన్, చిన్నతంబి

పెరంబూర్, జూలై 24: పదమూడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు వృద్ధులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరియలూరు జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈనెల 21వ తేది పాఠశాలకు సెలవు కావడంతో బాలిక ఇంటి దగ్గరే ఉంది. ఆ సమయంలో కూలి పనులకు వెళ్లిన తల్లి ఇంటికి తిరిగి రాగా, ఇంటికి పలువురు వచ్చి వెళ్లినట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. ఈ విషయమై తల్లి కుమార్తెను ప్రశ్నించగా, రాజేంద్రన్ (65), పన్నీర్‌సెల్వం (76), చిన్నతంబి (70)లు ఇంట్లో ప్రవేశించి, ఒకరి తర్వాత ఒకరు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక ఏడుస్తూ తెలిపింది. దీంతో, దిగ్భ్రాంతి చెందిన తల్లి 1098కు ఫోన్ చేసి ఫిర్యాద చేసింది. ఈ ఘటనపై జయంకొండాం మహిళా పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను అరెస్ట్ చేసి జైలు తరలించారు. వీరిలో చిన్నతంబి, పన్నీర్‌సెల్వం సోదరులు కావడం గమనార్హం.

ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగి ఆత్మహత్య

అడయార్, జూలై 24: స్థానిక ఆవడిలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన మాజీ ఉద్యోగి ఒకరు ఏకే 47 తుపాకీతో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆవడి ముత్త పుదుపేట పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. మైలాడుదురైకు చెందిన కాళిదాస్ (55) ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో నాయక్ హోదాలో పనిచేశారు. ఈయనకు భార్య జీవశ్రీ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వీరంతా సొంతూరులో ఉంటున్నారు. కాళిదాస్ మాత్రం పదవీ విరమణ చేసినప్పటికీ ఆవడిలోని ఎయిర్‌ఫోర్స్ కేంద్రంలో ఎనిమిదో టవర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ ముత్త పుదుపేట ఎయిర్ ఫోర్స్ క్వార్టర్స్ ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజామున ఆయన తన దగ్గరున్న ఏకే47 తుపాకీతో ఎనిమిదో టవర్‌లోనే కాల్చుకున్నారు. తుపాకీ శబ్దం విన్న ఇతర సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకునే సరికి విషాదం జరిగిపోయింది. సమాచారం అందుకున్న ముత్తపుదుపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కాళిదాస్ మృతదేహాన్ని కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, ఆత్మహత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 24: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం: వండలూరు, పెరుంగళత్తూర్, కలైంజర్ హైరోడ్డు, శివశంకరన్ వీధి, భారతి వీధి, బాలాజీ వీధి, శ్రీనివాస నగర్, సూరత్తమ్మన్ ఆలయ వీధి, కన్నదాసన్ వీధి, అర్చన నగర్, వెంకటస్వామి వీధి, మణి వీధి, మణిమేఘలై వీధి, కలైవాణి వీధి, మణికంఠన్ వీధి, ఉమా నగర్, వెస్ట్ తాంబరం, ముల్లై నగర్, పుదుతాంగళ్, అంబేడ్కర్ వీధి, వైగై నగర్, గాంధీ నగర్, పాత స్టేట్ బ్యాంక్ కాలని, కామరాజ్ వీధి, గాంధీ రోడ్డు ఏరియా, కడప్పేరి, మౌలానా నగర్, అర్పుతం నగర్, నాగరత్నం నగర్, రామతిలగం వీధి, అమ్మన్ ఆలయ వీధి, జెరూసలేం వీధి, పిల్లయార్ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, పాఠశాల వీధి, నడు వీధి, తూర్పు వీధి, బీఎం రోడ్డు, పులికురడు, రాజాజీ నగర్, మాడంబాక్కం మెయిన్ రోడ్డు, హంసా గార్డన్, జైన్ అపార్ట్‌మెంట్స్, తిరుమగళ్ నగర్, బ్యాంక్ కాలని, భువనేశ్వరి నగర్, గణేంద్ర నగర్, తిరువళ్లువర్ వీధి, గాంధీ వీధి, గణపతి నగర్, శ్రీరామ్ నగర్, సుదర్శన్ నగర్

కేకే నగర్: వలసరవాక్కం, ఆళ్వార్ తిరునగర్, లక్ష్మి నగర్ అన్ని వీధులు, రాధా అవెన్యూ, ఏకేఆర్ నగర్, మెలన్ నగర్ 5 నుంచి 9 వీధులు, రాధా నగర్, వడపళని, కన్నగిపురం 1 నుంచి 3 వీధులు, విజయరాఘవపురం 1 నుంచి 5 క్రాస్ వీధులు, మీరాన్ సాహెబ్ వీధి, కుమరన్ కాలనీ మెయిన్ రోడ్డు, సాలిగ్రామం, రాణి అన్నా నగర్ 80 అడుగుల రోడ్డు, రాజమన్నార్ రోడ్డు, ఏవీఎం స్టూడియో, అష్ట వీధి, ఆర్కాడు రోడ్డు, పీటీ రాజన్ రోడ్డు, కేకే నగర్ 14,15 సెక్టార్లు, కేకే నగర్ 94 నుంచి 104 వీధులు, ఎస్‌ఎస్‌బీ నగర్, ఎస్వీ లింగం రోడ్డు, అళగర్ పెరుమాళ్ ఆలయ వీధి, విజయా వీధి, వట్టగపాళయం

ఐటీసీ: రింగ్ రోడ్డు, 200 అడుగుల రేడియల్ రోడ్డు, దురైపాక్కం, పిళ్లయార్ ఆలయ వీధి, గంగైఅమ్మన్ ఆలయ వీధి, స్టేట్ బ్యాంక్ కాలనీ, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, పోస్టాఫీసు, ఎంసీఎన్ నగర్, ఓఎంఆర్, పీటీసీ కాలనీ, రాజీవ్ గాంధీ రోడ్డు, శ్రీ విద్య అవెన్యూ, నెహ్రూ నగర్, మూట్టికారన్ చావడి, సాయిబాబా నగర్, సుబ్రమణియన్ వీధి, పాంబన్ బాబా నగర్, భగత్ సింగ్ వీధి, వీఓసీ వీధి, నేతాజీ వీధి

పూందమల్లి: పూందమల్లి మున్సిపాలిటీ, సెన్నీర్ కుప్పం, కరయన్ చావడి, తులసిదాస్ నగర్, చిన్న మాంగాడు, కుమరన్ చావడి

పోరూర్: కుండ్రత్తూర్, బాబూ గార్డన్, తిరుచెందూర్ పురం, కొల్లచ్చేరి, బజారు వీధి, నాంగు రోడ్డు కుండ్రత్తూర్

అంబత్తూర్: వీజీఎన్ చిన్న కాలనీ, పెద్ద కాలనీ, పీకేఎం రోడ్డు, ప్రిన్స్ అపార్ట్‌మెంట్స్, గణేశ్ వీధి, నాగేశ్వరరావు 4వ క్రాస్ వీధి, అయ్యపాక్కం, అయనంబాక్కం, న్యూ సెంచరీ నగర్, సంపూర్ణం నగర్, విజయా నగర్, పడవేట్టమ్మన్ ఆలయ వీధి, ఎటన్ అవెన్యూ, మేల్‌అయనంబాక్కం రోడ్డు, రాయల్ క్లబ్ రోడ్డు, శ్రీనివాసపిళ్లై రోడ్డు, పచ్చయప్పన్ నగర్, పొన్‌రాజ్ కుప్పం, కోలడి రోడ్డు, సరస్వతి నగర్

తండయార్‌పేట: అత్తిపట్టు పుదునగర్, మౌత్తమేడు, కేఆర్ పాళయం, కాట్టుపల్లి, కాట్టుపల్లి ఎస్టేట్, తమిళ్ కురింజియూర్, నందియంబాక్కం, తాలాంజి, కరయాన్‌మేడు

అడయార్: ఇందిరా నగర్, అక్కరై, ప్రిస్టీజ్ సిల్వర్ స్ప్రింగ్ విలాస్, స్పార్కింగ్ శాండ్ అవెన్యూ, ఎంజీఆర్ నగర్, స్ప్రింగ్ గార్డన్ 1,2 వీధులు, అల్లికుళం, ఈసీఆర్, కడల్‌పారై, సన్‌రైజ్ అవెన్యూ, కలైంజర్ కరుణానిధి రోడ్డు, కాపర్ బీచ్ రోడ్డు, పనై షెల్ అవెన్యూ, ఎన్ఆర్ఐ లే అవుట్, ఎస్బీఐ కాలని, బీసెంట్ నగర్ 7 నుంచి 14 క్రాస్ వీధులు, శాస్త్రినగర్ 10వ క్రాస్ వీధి, శాస్త్రి నగర్ 1వ మెయిన్ రోడ్డు, శాస్త్రి నగర్ 3,4 లేన్లు, కళాక్షేత్ర, తిరువాన్మియూర్, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 4 వీధులు, వాల్మీకి వీధి, శివసుందర అవెన్యూ 1,2 వీధులు, కళాక్షేత్ర రోడ్డు, ఉల్లూరు, విజయా నగర్ 1వ మెయిన్ రోడ్డు, గోల్డన్ అవెన్యూ, శక్తిపొన్నమ్మాళ్ వీధి, ఎంజీఆర్ 7 నుంచి 13 వీధులు, వెంకటేశ్వర నగర్ 3వ మెయిన్ రోడ్డు, రాజ్‌భవన్, గాంధీ రోడ్డు, కోకిలం వీధి, న్యూ కాలని, కబాలి వీధి, ఆండాళ్ అవెన్యూ, సోని నగర్, సీతారామన్ నగర్, భువనేశ్వరి నగర్, నాదన్ సుబ్రమణి కాలని, వీజీపీ సెల్వ నగర్, బెతేల్ అవెన్యూ, ముత్తుకృష్ణన్ వీధి

షోలింగనల్లూర్: బాబూ నగర్, చిత్తాలపాక్కం, పంచాయతి కార్యాలయం, మేడవాక్కం, అంబేడ్కర్ నగర్, అన్నా రోడ్డు, తిరువళ్లువర్ నగర్, నెసవాలర్ నగర్, పద్మావతి నగర్, రైస్ మిల్ రోడ్డు, జయచంద్రన్ నగర్, పెరియార్ రోడ్డు, పెరుంబాక్కం, ముత్తమిళ్ నగర్, న్యూ బ్లాక్

మధురవాయల్: వానగరం, చెట్టియార్ అగరం మెయిన్ రోడ్డు, రాజీవ్ నగర్, శివపుదంమేడు, ఎస్వీ స్కూల్, వీవీటీ సోమ, పాత చేపల మార్కెట్.



సీనియర్ పాత్రికేయులతో 'పేచ్చి' ఆడియో రిలీజ్



దర్శకుడు రామచంద్రన్ తెరకెక్కించిన 'పేచ్చి' చిత్రం ఆడియోను తమిళ చిత్రపరిశ్రమకు చెందిన ఇద్దరు సీనియర్ పాత్రికేయులు దేవీమణి, రాంజీ చేతుల మీదుగా విడుదల చేశారు. వెయిలోన్ ఎంటర్‌టైన్మెంట్ గోకుల్ బినాయ్, వెరుస్ ప్రొడక్షన్స్ షేక్ ముజీబ్ సంయుక్తంగా నిర్మించారు. బాల శరవణన్, గాయత్రి శంకర్, దేవ్, మురళి తదితరులు ప్రధాన పాత్రలు పోషించగా వచ్చే నెల రెండో తేదీన విడుదల చేస్తున్నారు. దర్శకుడు రామచంద్రన్ మాట్లాడుతూ, 'ఇది నా తొలి చిత్రం. స్నేహితుల కోసం స్నేహితులతో కలిసి నిర్మించిన చిత్రం. నిర్మాత గోకుల్‌తో పిచ్చాపాటిగా మాట్లాడే సమయంలో ఓ సినిమా నిర్మిద్దామా అని అడిగాను.. అది చివరకు ఆడియో రిలీజ్ వేడుక వరకు వచ్చింది. పదేళ్ళ క్రితం ఒక లఘు చిత్రాన్ని నిర్మించగా, ఇపుడు పూర్తిస్థాయి సినిమా రూపొందించాను. సాధారణంగా దెయ్యం సినిమాలంటేనే ఒకే ఫార్మెట్‌లో ఉంటాయి. ఈ సినిమా ప్రారంభించిన తర్వాత ఒక విషయంలో ఖచ్చితంగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. ప్రతి సన్నివేశాన్ని ప్రేక్షకుడు మిస్ కాకుండా చూస్తే ఓ సరికొత్త అనుభవాన్ని ఇస్తుంది' అని పేర్కొన్నారు. నటుడు బాల శరవణన్ మాట్లాడుతూ, 'తమిళ ఇండస్ట్రీకి అడుగుపెట్టిన వెరూస్ ప్రొడక్షన్‌కు స్వాగతం పలుకుతున్నాం. నా స్నేహితులు గోకుల్ బినాయ్, విఘ్నేష్, విజయ్ కందస్వామికి ధన్యవాదాలు. దర్శకుడు కథ చెప్పగానే ఒకే చెప్పేశాను. ప్రతి ఒక్కరినీ ఎంటర్‌టైన్ చేసే మూవీగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు.



ప్రదీప్ రంగనాథన్ - కృతిశెట్టి

అంకితభావంతోనే ఉన్నతస్థితి

● హీరో కార్తీ ట్వీట్

అంకితభావంతో పనిచేస్తే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని తన అన్న హీరో సూర్య నేర్పించారని హీరో కార్తీ అన్నారు. మంగళవారం హీరో సూర్య పుట్టిన రోజు సందర్భంగా కార్తీ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. 'జీరో నుంచి ప్రారంభించినా కష్టపడుతూ, అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చని నేర్పిన వ్యక్తికి పుట్టిన రోజు శుభాకాంక్షలు. సమాజంలో అపారమైన ప్రేమను పంచుతున్న అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు' అంటూ పేర్కొన్నారు. ఇక హీరో సూర్య విషయానికి వస్తే, ఆయన పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సెలెబ్రిటీలు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఆయన నటించిన 'కంగువా' చిత్రం అక్టోబరు 10న విడుదలకానుంది. అలాగే, కార్తీక్ సబ్బరాజ్ దర్శకత్వంలో తన 44వ చిత్రంలో నటిస్తున్నారు. మరోవైపు తమ్ముడు కార్తీ హీరోగా సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై 'మెయ్యళగన్' చిత్రాన్ని నిర్మించగా, ఈ సినిమా సెప్టెంబరు 27వ తేదీన విడుదల చేయనున్నారు.

చిత్రజ్యోతి



'కొట్టుకాళి'లో సూరి తదితరులు


23న సూరి 'కొట్టుకాళి' రిలీజ్

ప్రముఖ హాస్య నటుడు సూరి హీరోగా బిజీ అవుతున్నారు. ఆయన నటించిన కొత్త చిత్రం 'కొట్టుకాళి' వచ్చే నెల 23వ తేదీన విడుదలకానుంది. వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'విడుదలై' చిత్రంతో కథానాయకుడిగా మారిన ఈ హాస్య నటుడు.. ఆ సినిమా విజయంతో వరుస చిత్రాల్లో హీరోగా నటిస్తున్నారు. 'విడుదలై-2' భాగంలో నటిస్తున్నారు. ఇటీవల ఆయన నటించిన 'గరుడన్' సినిమా విడుదలై ఘన విజయం సాధించింది. ఇపుడు మరోమారు 'కొట్టుకాళి'గా ప్రేక్షకుల ముందుకురానున్నారు. ఇందులో మళయాల భామ అన్నా బెన్ హీరోయిన్. పీఎస్ వినోద్ రాజ్ దర్శకుడు. హీరో శివకార్తికేయన్ సొంతంగా నిర్మించే ఈ చిత్రం ఇప్పటికే బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో 'కొట్టుకాళి' మూవీపై నిర్మాత శివకార్తికేయన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేస్తూ, 'ఈ సినిమాను ఆగస్టు 23వ తేదీ విడుదల చేస్తున్నాం. మూఢ నమ్మకాలు, పితృస్వామ్యం, సంక్లిష్టమైన మానవ భావోద్వేగాలు వంటి అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంది' అని పేర్కొన్నారు.

'బ్లూ స్టోరీ'గా మారిన 'ఎల్ఐసి'?

విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్ - కృతిశెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ఎల్ఐసి' (లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్). ఈ సినిమా టైటిల్ మారనుంది. 'బ్లూ స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ సినిమా టైటిల్ మార్చడానికి కారణం లేకపోలేదు. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ తమ సంస్థ పేరు సినిమా టైటిల్‌గా ఉపయోగించేందుకు అనుమతించలేదు. చిత్ర బృందానికి నోటీసులు పంపింది. దీంతో దర్శకనిర్మాతలు వెనక్కితగ్గి, తమ చిత్రం పేరును 'బ్లూ స్టోరీ'గా మార్పు చేసేందుకు ముందుకు వచ్చారు. దీనికి సంబంధించిన అధికార పూర్వక ప్రకటన వెల్లడికానుంది. కాగా, ప్రదీప్ రంగనాథన్ 'లవ్‌స్టోరీ' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ తర్వాత నటిస్తున్న సినిమా ఇది. జనవరి నుంచి చిత్రీకరణ జరుపుకుంటోంది. ఎస్‌జే సూర్య, యోగిబాబు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నటి నయనతారకు చెందిన రౌడీ పిక్చర్స్‌తో కలిసి 7 స్క్రీన్ స్టూడియోపై నిర్మాత లలిత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

శివవిష్ణు ఆలయ కోనేరు పునరుద్ధరణ



మరమ్మతుకు ముందు - తరువాత

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూరులోని కరుక్కు మెయిన్‌రోడ్డు, టీఎస్‌బీ కాలనీలో వున్న శివవిష్ణు ఆలయ కోనేరును అధికారులు పునరుద్ధరించారు. ఈ కొలను చుట్టూ చెట్ల పొదలు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా తయారైంది. అంతేగాక కొంతమేర ఆక్రమణలకు గురైంది. దీని పై స్థానికుల నుంచి వచ్చిన వినతుల మేరకు రంగంలోకి దిగిన చెన్నై కార్పొరేషన్ అధికారులు.. రూ.36 లక్షలతో కొలనుకు మరమ్మతులు చేపట్టారు. పూడిక తీయడంతో పాటు కొలను చుట్టూ ప్రహరీగోడ, ముఖద్వారం, 2 టాయిలెట్లు, ప్లాట్‌ఫాం, వాకింగ్ ట్రాక్, విద్యుత్‌దీపాలు, సెక్యూరిటీ గది, ఎక్కడికక్కడ బెంచీలు ఏర్పాటు చేశారు. కోనేరులోకి వర్షపు నీరు రావడంతో పాటు అదనపు నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అంతేగాక ప్రహరీ చుట్టూ, బెంచీలకు ఆకర్షణీయమైన రంగులద్ది ప్రజలను ఆహ్లాదపరిచేలా సుందరీకరించారు.



సిద్ధమైన బెంచీలు

1800 సంవత్సరాల క్రితమే భారత్-యూఏఈ మధ్య వాణిజ్యం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భారత్-యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్య 1800 సంవత్సరాల క్రితమే వాణిజ్యం ప్రారంభమైందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా పేర్కొన్నారు. బుధవారం నగరంలో 'ఇన్వెస్టోపియా గ్లోబల్' పేరుతో జరిగిన అంతర్జాతీయ సదస్సులో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ టౌక్ అల్ మరీతో కలిసి పాల్గొన్న మంత్రి టీఆర్‌బీ రాజా మాట్లాడుతూ.. దేశ పురోగతికి తమిళనాడు చోదక శక్తిగా పని చేస్తుందన్నారు. మన రాష్ట్రం ఆటోమొబైల్ క్యాపిటల్‌గా, ఈవీ క్యాపిటల్, ఇన్వెస్ట్‌మెంట్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా పేరు గడించిందన్నారు. యూఏఈ మంత్రి మాట్లాడుతూ.. యూఏఈ భారతదేశ మూడవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, ముున్ముందు కూడా ఈ భాగస్వామ్యాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఇంటర్నేషనల్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు ఆర్.దినేష్, సీఐఐ దక్షిణ ప్రాంత చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్.నందిని తదితరులు పాల్గొన్నారు.

వీనుల విందుగా నారాయణీయం పారాయణం

ప్యారీస్, జూలై 24: స్థానిక షావుకారుపేటలోని మహామంత్ర భజన మండలి 91వ వార్షిక అఖండ సంకీర్తన సప్తాహం వైభవంగా జరుగుతోంది. కలివి రామన్న శెట్టి కల్యాణ సత్రంలో ఈ నెల 20న ప్రారంభమైన పది రోజుల అఖండ నామ సంకీర్తన ఈ నెల 29 వరకు కొనసాగనుంది. అఖండ దీపారాధనలు, షోడశ నామ మహామంత్ర సంకీర్తన, భజన, కలశ స్థాపన, అన్నకూట ఉత్సవం, పూజా నైవేద్యం, గీతా పారాయణం, గోమాత పూజ, తిరుకల్యాణం, ఆంజనేయ ఉత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం మహిళలు షోడశ నామ అఖండ నామ సంకీర్తనలో భాగంగా నారాయణీయం పారాయణం చేశారు. అధ్యక్షులు వీరబొమ్మల జనార్ధననాయుడు, కార్యదర్శి కొత్తబాల నరసింహులు, కోశాధికారి పొన్నూరు వెంకటసుబ్బయ్య ఏర్పాట్లను పర్యవేక్షించి, భక్తులకు అన్నతీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బుధవారం చెన్నై మ్యూజిక్ అకాడమీలో జరిగిన ఆదాయపన్నుశాఖ వార్షికోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి.. ఉత్తమ ఉద్యోగులకు, ఉత్తమ ఆదాయ పన్ను చెల్లింపుదారులను సత్కరించి, పురస్కారాలు ప్రదానం చేస్తున్న దృశ్యం



చెన్నై సీఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకొని తన కుమారుడి వివాహ పత్రిక అందజేస్తున్న వేలూరు నరువి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధ్యక్షుడు జీవీ సంపత్, ఉపాధ్యక్షురాలు అనిత సంపత్ దంపతులు

తమిళనాట ఎస్ఎంఈ వ్యాపార విస్తరణ

● కోటక్ మహీంద్ర అధికారి శేఖర్ బండారి



మీడియాతో మాట్లాడుతున్న శేఖర్ బండారి

ప్యారీస్, జూలై 24: తమిళనాడు ఎస్ఎంఈ వ్యాపార విస్తరణ చేపట్టినట్లు కోటక్ మహీంద్ర బ్యాంక్ ఎస్ఎంఈ విభాగం హెడ్ శేఖర్ బండారి పేర్కొన్నారు. నగరంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ బ్యాంక్ వృద్ధి వ్యూహంలో ఎస్ఎంఈలో అంతర్భాగం, దక్షిణ ప్రాంతంతో పాటు వృద్ధికి తమిళనాడు కేంద్రంగా ఉందన్నారు. బ్యాంక్ ట్రేడింగ్, కలెక్షన్, వర్కింగ్ కేపిటల్ మేనేజ్‌మెంట్, ఎస్టేట్ ప్లానింగ్, వెల్త్, పేరోల్‌లో సమగ్ర స్థిరమైన పరిష్కారాలు అందించడమే లక్ష్యమన్నారు. సేవ్ ఎనర్జీ మిషన్ పథకం కోసం ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆడికృత్తిక ఉత్సవాల ఎఫెక్ట్...

తిరుత్తణిలో ప్రత్యేక దర్శనం రద్దు

● మంత్రి పీకే శేఖర్‌బాబు



ప్యారీస్, జూలై 24: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృతిక ఉత్సవాలను పురస్కరించుకొని రూ.200 ప్రత్యేక దర్శనం రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు ప్రకటించారు. ఈ ఆలయంలో ఆడికృతిక ఉత్సవాలకు చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను బుధవారం మంత్రి ఆర్.గాంధీతో కలసి మంత్రి శేఖర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసు శాఖ, మున్సిపల్, ఆరోగ్య, అగ్నిమాపక, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై మంత్రి శేఖర్‌బాబు మీడియా తెలియజేశారు. తిరుత్తణి ఆలయంలో ఈనెల 27 నుంచి 31వ తేది వరకు జరిగే ఆడికృతిక ఉత్సవాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొనే అవకాశముందన్నారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించామని, రక్షిత తాగునీటిని 120 ప్రాంతాలు, మరుగుదొడ్ల వసతి 160 ప్రాంతాలు, 60 ప్రాంతాల్లో తాత్కాలిక స్నానపు గదులు, 160 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, 10 ప్రాంతాల్లో తాత్కాలిక పోలీసు బూత్‌లు, మరో 24 ప్రాంతాల్లో పోలీసు వాచ్ టవర్లు ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

తమిళనాడు రైల్వే పథకాలకు రూ.6,365 కోట్లు కేటాయింపు

● కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



ప్యారీస్, జూలై 24: తమిళనాడు రైల్వే పథకాలకు రూ.6,565 కోట్ల మేర నిధులు కేటాయించినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. నగరంలోని దక్షిణ రైల్వే కార్యాలయ ప్రాంగణంలోని సుభాష్ హాలులో బుధవారం సాయంత్రం 4 గంటలకు మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న మీడియా ప్రతినిధులతో కేంద్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన జనరల్ బడ్జెట్‌లో గత కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం కంటే తమిళనాడుకు ఏడింతలు అదనంగా నిధులు కేటాయించిందని తెలిపారు. ఒక్క రైల్వే పథకాలకు రూ.6,565 కోట్లు కేటాయించామని, మరికొన్ని రైల్వే పథకాల అమలుకు 2,000 ఎకరాలకు పైగా భూములు అవసరమని తెలిపారు. ఈ భూసేకరణలో రాష్ట్రప్రభుత్వం జాప్యం చేస్తోందని, ఇప్పటివరకు 879 ఎకరాలు మాత్రమే సేకరించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

ప్రొఫెసర్ల అవకతవకలపై విచారణకు కమిటీ

● అన్నా వర్సిటీ ఉపకులపతి వేల్‌రాజ్

పెరంబూర్, జూలై 24: అన్నా విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల ప్రొఫెసర్ల అవకతవకల విచారణకు కమిటీ ఏర్పాటుచేసినట్లు వర్సిటీ ఉపకులపతి వేల్‌రాజ్ తెలిపారు. ప్రొఫెసర్లు ఒకే సమయంలో కళాశాలల్లో పనిచేస్తున్నట్లు నకిలీ లెక్కలు చూపుతున్నారని అర్పోర్ ఇయక్కం ఆరోపించింది. అవకతవకలకు సంబంధించిన ఆధారాలకనుగుణంగా విచారణ చేపట్టేందుకు ప్రత్యేక కమిటీ నియమించినట్లు ఉపకులపతి తెలిపారు. రాష్ట్రంలోని 224 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 350 మందికి పైగా ప్రొఫెసర్లు ఒకే పేరుతో వేర్వేరు కళాశాలల్లో పనిచేస్తున్నారని మంగళవారం అర్పోర్ ఇయక్కం ఆరోపించింది. ఈ విషయమై బుధవారం అన్నా వర్సిటీ ఉపకులపతి మీడియాతో మాట్లాడుతూ.. అన్నా విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో అవకతవకలు జరుగుతున్నాయనేది వాస్తవమన్నారు. 189 మంది ప్రొఫెసర్లు ఈ అవకతవకలకు పాల్పడ్డారని గుర్తించామని, మొత్తం 50 కళాశాలల్లో ఇలాంటివి జరిగినట్లు గుర్తించామని, ఆకళాశాలలు, ప్రొఫెసర్లపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.

పీహెచ్‌డీ విద్యార్థులకు ఉపకార వేతనం ఎప్పుడు?

● ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అన్బుమణి

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌డీ విద్యార్థులకు నెలకు రూ.25 వేల ఉపకారం అందించాలనే ముఖ్యమంత్రి రీసెర్చ్‌గ్రాంట్ పథకం ఎప్పుడు అమలు చేస్తారని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ ప్రశ్నించారు. గ్రాంట్ కోసం అర్హులైన విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించి, డిసెంబరు 29న ఫలితాలు, మార్చి 15న సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. నాలుగు నెలలైనా ఎంపికైన అభ్యర్థుల ప్రకటించలేదని డాక్టర్ అన్బుమణి విమర్శించారు. తక్షణం ఆయా విద్యార్థులకు లేఖలు అందజేసి, వారి పరిశోధనలకు తోడ్పడాలని అన్బుమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డేంజర్ బాస్....

ధనుష్కోటి వంతెనపై సెల్ఫీల కోసం పర్యాటకుల ఆసక్తి



మూడు వైపులా అలలు ఎగసిపడే వంతెనపై సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ధనుష్కోటి సమీపం ముకుందరాయర్ సత్రం వద్ద మూడు వైపులా రాక్షస అలలు ఎగసిపడే చోట ధ్వంసమైన వంతెనపై నిలబడి పర్యాటకులు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడుతుండటం పట్ల స్థానికులు, జాలర్లు ఆందోళన చెందుతున్నారు. రామేశ్వరం ఆలయానికి వెళ్లే భక్తులు, పర్యాటకులు ధనుష్కోటి, అరిచ్చల్‌మునై, ముకుందరాయర్ సత్రం ప్రాంతాలను సందర్శిస్తుంటారు. 2017లో ముకుందరాయర్ సత్రం సమీపంలో మత్స్యశాఖ అధికారులు చేపల అన్‌లోడింగ్ పాయింట్ నిర్మించింది. దాని నిర్మాణ పనులు ప్రారంభమైనప్పుడు జాలర్లు తీవ్ర నిరసన ప్రకటించారు. ఆ ప్రాంతం వద్ద అలల తాకిడి అధికంగా ఉంటుందని, దీంతో చేపల అన్‌లోడింగ్ పాయింట్ వంతెన పూర్తిగా సముద్రపు కోతకు గురవుతుందని హెచ్చరించారు. జాలర్ల హెచ్చరికలను వినిపించుకోకుండా ఆంగ్ల అక్షరం 'టి' ఆకారంలో అక్కడ వంతెన నిర్మించారు. కొద్ది రోజులకే ఆ వంతెనలో ఓ భాగం సముద్రంలో కొట్టుకుపోయింది. మరో భాగం ఏ క్షణంలోనైనా ధ్వంసమై కడలిలో మునిగేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పర్యాటకులు అలలు ఎగసిపడుతున్నప్పుడు సెల్ఫీలు తీసుకునేందుకు బారులు తీరుతున్నారు. అక్కడకు వెళ్లొదని జాలర్లు హెచ్చరిస్తున్నా పర్యాటకులు పట్టించుకోకుండా ధ్వంసమైన వంతెనపై నిలిచి రాక్షస అలలు ఎగసిపడుతున్నప్పుడు సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇకనైనా మత్స్యశాఖ అధికారులు ధ్వంసమైన ఆ వంతెన ప్రాంతానికి పర్యాటకులు వెళ్లకుండా రక్షణ గోడ నిర్మించాలని జాలర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.



భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడుని బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకుని 'తెలుగు భాషలో మెళకువలు', 'గాడి తప్పిన చదువులు'.. తదితర పుస్తకాలను బహూకరిస్తున్న సాహితీ విమర్శకులు తూమాటి సంజీవరావు